నేడు అంతర్జాతీయ యోగా డే వేడుకలు

- గచ్చిబౌలి స్టేడియంలో కార్యక్రమానికి హాజరవనున్న గవర్నర్, సిఎం, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర మంత్రులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు, సెలబ్రెటీలు పాల్గొననున్నారు. దాదాపు ఐదు వేల మందితో నిర్విహించనున్న ఈ కార్యక్రమానికి వైద్యారోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఆరు గంటలకు యోగా సెషన్ ప్రారంభం కానుంది. ఈ సెషన్‌లో గవర్నర్, సీఎం, మంత్రులు, సెలబ్రెటీలు యోగా చేయనున్నారు. రాష్ట్రంలో యోగాను ప్రతి ఇంటికీ చేరువ చేసే ఉద్దేశంతో గతేడాది ప్రభుత్వం 628 మంది యోగా గురువులను నియమించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మరో 250 మందికిపైగా యోగా గురువుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో (సబ్ సెంటర్లు) ప్రతి రోజూ ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు. కొత్తగా నియమితులైన యోగా గురువులు కొత్తగా ఐదు లక్షల మందికి యోగా నేర్పించారని ఆయుష్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. గర్భిణులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేషెంట్లకు ప్రత్యేక యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరి జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఈసెట్ అభ్యర్థుల వెబ్ ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదుకు శనివారం వరకే గడువున్నది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు 11,883 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 6,680 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. వెబ్‌ఆప్షన్ల నమోదుకు శనివారం వరకు అవకాశముందని తెలిపారు. ఈనెల 25న తొలివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఇతర వివరాలకు https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణలో ఈస్ట్‌మాన్ విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సోలార్ ఎనర్జీ ఉత్పత్తుల కంపెనీ ఈస్ట్ మ్యాన్ ఆటో అండ్ పవర్ లిమిటెడ్ తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించినట్లు ప్రకటించింది. గ్రిడ్ టై ఇన్వెర్టర్స్, హైబ్రిడ్ ఇన్వెర్టర్‌లు, ఆఫ్ గ్రిడ్ ఇన్వెర్టర్‌లు, లీడ్ యాసిడ్, లిథియం బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్‌ని అందిస్తున్నట్లు పేర్కొంది. తెలంగాణలో మెరుగైన సోలార్ పరిష్కారాలను అందించడానికి వీలుగా హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ లాంటి ముఖ్యమైన మార్కెట్‌లలో విస్తరిస్తూ.. ఉనికిని పెంచుకుంటున్నట్లు పేర్కొంది.

49 జిఒను రద్దు చేయాలి

- ఆదివాసీలను వెళ్లగొట్టేందుకే కొమరంభీం టైగర్ కారిడార్
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 49 జిఒను తీసుకొచ్చాయని, దాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివాసీలు నివసిస్తున్న, వారు సాగు చేస్తున్న భూముల నుంచి వెళ్లగొట్టేందుకే కొమరంభీం టైగర్ కారిడార్‌ను తెచ్చాయని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల పార్టీ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులను తమ్మినేని వీరభద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ అటవీ విధానం ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల హక్కులను కాలరాస్తున్నదని చెప్పారు. అటవీ, ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలోని నాలుగు లక్షల ఎకరాలను అదానీకి అప్పజెప్పిందని వివరించారు. అటవీ ప్రాంతంలోని ఆదివాసీలను అక్కడి నుంచి వెళ్లగొట్టి టైగర్ కారిడర్‌ల పేరుతో భూములను తీసుకొంటుందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలివ్వాలంటూ దరఖాస్తులు వస్తే, కేవలం నాలుగు లక్షల ఎకరాలకు మాత్రమే బిఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. మిగిలిన ఎనిమిది లక్షల ఎకరాల సాగు భూమికి కూడా పట్టాలిస్తామంటూ కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని చెప్పారు. ఏడాది దాటినా హామీని అమలు చేయలేదని అన్నారు. పైగా పోడు సాగుదారులపై అటవీ అధికారులతో దాడులు చేయించి, కేసులు పెడుతున్నదని విమర్శించారు. తక్షణమే ఇలాంటి దుర్మార్గాలను విడనాడి, మిగిలినవారికి కూడా పోడు హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. వారిపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల్లేవనీ, వాటిలో ఖాళీగా ఉన్న డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, నర్సుల పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పి ఆశయ్య, ఉడుత రవీందర్, పూసం సచిన్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కొమరం భీం జిల్లా కార్యదర్శి కె రాజన్న, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, నాలుగు జిల్లాల కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తమ్మినేని

తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించాలి

- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంపై అఖిలపక్ష సమావేశం
- బనకచర్లను వెంటనే ఆపాలి : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తుమ్మిటిహట్టి వద్ద ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పుడే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకూ సాగునీరందుతుందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను ఆపాలనీ, దాని పునర్నిర్మాణం, మరమ్మతుల సాధ్యాసాధ్యాలపై అఖిలపక్ష సమావేశాన్ని, నీటిపారుదల రంగ నిపుణులు, మేధావులతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును సీపీఐ మొదటి నుంచి వ్యతిరేకించిందని గుర్తు చేశారు. దాని బదులుగా గతంలో నిర్ణయించిన ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్దే బ్యారేజీ నిర్మిస్తే ఒక్క లిఫ్టు ద్వారా ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్ల తీసుకెళ్ళే అవకాశం ఉండేదన్నారు. రీడిజైన్ పేరుతో దాన్ని పక్కనబెట్టి, కాళేశ్వరం పేరుతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువన నిర్మించిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్ద బ్యారేజీల నుంచి ఎగువన ఎల్లంపల్లికి నీటిని లిఫ్టు చేయడం అధిక వ్యయంతో కూడుకున్నదని చెప్పారు. ఆ మూడు బ్యారేజీల నిర్మాణానికి రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు ఖర్చయ్యిందన్నారు. వాటిని తిరిగి నిర్మించినా, మరమ్మతులు చేసినా భవిష్యత్తులో ఎలా ఉంటాయనేది చెప్పలేమనీ, కాబట్టి విజిలెన్స్ నివేదిక, ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక, జస్టిస్ పీసీ ఘోష్ నివేదికలను ప్రభుత్వానికి త్వరగా ఇవ్వాలని కోరారు. ఇద్దరిని అరెస్టు చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును వెంటనే ఆపాలనీ, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై చర్చించుకోవాలని డిమాండ్ చేశారు.

రెండు లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి

- జాబ్ కేలెండర్ ప్రకటించాలి
- ఎంపి ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- ధర్నాచౌక్ వద్ద నిరుద్యోగుల భారీ ధర్నా
- బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డిని నిలదీసిన నిరుద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేసి జాబ్ కేలెండర్ ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరుద్యోగులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు హాజరైన ఎంపి మాట్లాడుతూ.. 18 నెలల కాలంలో పలు కోర్టు నోటిఫికేషన్లు కలిపి 60వేల ఉద్యోగాలు కుడా భర్తీ చేయలేదన్నారు. మిగతా ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఇంకా అనేక ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏడేళ్ల కిందట కొత్తగా ఏర్పడిన 23 జిల్లాల ఆఫీసులకు, మండలాలకు, మున్సిపాలిటీలకు పోస్టులు మంజూరు చేయాలని, దాంతో లక్షకు పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. టీచర్ పోస్టుల విషయంలో అన్ని గురుకుల, ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాల నియామకాలను ఒకేసారి ఫలితాలతో ప్రకటించి, ఆప్షన్ పద్ధతిని అన్వయించాలని సూచించారు. కొత్త తరాన్ని ప్రభుత్వంలోకి తీసుకొస్తే అవినీతిముక్త పాలన సాధ్యమవుతుందన్నారు. యువత పాలనారంగంలోకి వస్తే ఉత్సాహంతో, అంకిత భావంతో నిజాయితీగా పని చేస్తారని తెలిపారు.

జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ జారి చేసి అన్ని కేటగిరీల్లో 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీల లెక్కలు లెక్కించే విషయంలో కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పాటిస్తున్నారన్నారు ఎంతమంది రిటైర్ అయ్యారు? ఎంత మందికి ప్రమోషన్లు వచ్చాయి? కొత్త జిల్లాల ఆఫీసులు రావడం వల్ల ఎన్ని ఉద్యోగాలు సృష్టించారు? అనే అంశాలపై దృష్టి పెట్టకుండా ఖాళీలు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి నిరుద్యోగులే కారణమని, అలాంటి వారిని విస్మరించడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగిల్ల సతీష్, శివ అనంతయ్య, జీలపల్లి అంజి, రాజేందర్, రాజు నేత, మోడీ రాందేవ్, నిరుద్యోగ నాయకులు జనార్ధన్, ఇంద్ర, ఆస్మా, ప్రత్యూష ,అర్జున్, ఆకాష్, శంకర్, వంశీ, హరికృష్ణ దామోదర్ రెడ్డి, శృతి తదితరులు పాల్గొన్నారు

బిజెపి ఎమ్మెల్సీకి చేదు అనుభవం

ఈ ధర్నాకు వచ్చిన బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డికి నిరుద్యోగుల నుంచి నిరసన ఎదురైంది. ప్రజాసమస్యలు, నిరుద్యోగుల సమస్యలపై బిజెపి స్పందించడం లేదని, నిరుద్యోగుల సమస్యలపై తమ వైఖరి తెలిపిన తర్వాతే నిరసనలో పాల్గొనాలని కోరారు. దాంతో అంజిరెడ్డి నిరుద్యోగులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వారు వినలేదు.



అభివాదం తెలుపుతున్న ఎంపి కృష్ణయ్య, జూలకంటి తదితరులు



లబ్దిదారులకు ఇళ్ల మంజూరీ పత్రాలు అందజేస్తున్న మంత్రి గడ్డం

లక్షల కోట్ల అప్పు ఉన్నా.. 'సంక్షేమం' అమలు

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంపై రూ. ఎనిమిది లక్షల కోట్ల అప్పు ఉన్నా.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆపకుండా అమలు చేస్తున్నామని కార్మిక, ఉపాధికల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. సిద్దిపేట పట్టణంలో 2వ విడత ఇందిరమ్మ ఇళ్లు 2840 మందికి, అలాగే గజ్వేల్‌లో పలువురు లబ్దిదారులకు మంజూరీ పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాకు 12 వేల ఇళ్లు మంజూరు చేశామని, సిద్దిపేట నియోజకవర్గానికి 3000 ఇండ్లు, గజ్వేల్ నియోజకవర్గంలో మొదటి దశలో 3500 మంజూరు చేశామన్నారు. ప్రతి ఏడాదీ 3500 ఇండ్ల చొప్పున అందరికీ ఇస్తామన్నారు. అవసరమైతే జిల్లాకు ఎక్కువ వచ్చేలా సిఎంతో మాటాడతానని తెలిపారు. రూ.200 కోట్లతో జిల్లాకు ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించేందుకు సిఎం ఒప్పుకున్నారన్నారు. రూ.లక్షా 70 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని, వాటితో యువతకు ఉపాధి లభిస్తుందని, జిల్లాలో అడ్వాన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక అందిస్తామన్నారు. సిద్దిపేటలో కలెక్టర్ కె.హైమవతి మాట్లాడుతూ.. ఇల్లు అనేది గౌరవానికి చూచికని, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీకి వచ్చిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రేపటి నుంచి ముగ్గు పోయించుకొని, ఆరు నెలల్లో పూర్తి చేసుకోని గృహప్రవేశం చేసుకోవాలని, ఇండ్ల నిర్మాణానికి అయ్యే బిల్లులు సమయానికి వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సిద్దిపేటలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు, వైస్‌చైర్మెన్ జంగిటి కనకరాజు, సిద్దిపేట ఆర్‌డిఓ సాధానందం, హౌసింగ్ పిడి దామోదర్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ ఆర్‌డిఓ చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ నరసయ్య, ఎఎంసిలు చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ, వైస్ చైర్మెన్ సర్దార్‌ఖాన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇప్పటివరకు 65 లక్షల మందికి 'రైతు భరోసా'

- మరో నాలుగు రోజుల్లో సంపూర్ణం : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వానాకాలం రైతు భరోసా మొత్తం తొమ్మిది రోజుల్లో పూర్తి చేస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఇచ్చిన నేపథ్యంలో వరుసగా ఐదో రోజు కూడా నిధులను విడుదల చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం 65.12 లక్షల మంది రైతుల శాతాల్లో రైతు భరోసా జమ చేసినట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఈమేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదెకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో గురువారం నిధులు జమ చేయగా, శుక్రవారం ఎడెకరాల వరకు ఉన్న రైతుల అకౌంట్లలో నిధులు జమ చేసినట్టు వివరించారు. అందుకోసం రూ.905.89 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. దీంతో 2.64 లక్షల మంది రైతులు లబ్ధి పొందారనీ, కేవలం ఐదు రోజుల్లోనే రూ.7310.59 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన రైతులకు కూడా రైతు భరోసా సాయాన్ని అందజేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వ్యవసాయంలో ఎఐ సాంకేతికత

వ్యవసాయ రంగంలో ఎఐ సాంకేతికతను ఉపయోగించేందుకు వీలుగా రెండు, మూడు రోజులుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూమి, సీజన్ల వారీగా పంటల విస్తీర్ణం, పంట చీడపీడల గుర్తింపులో కూలీల వాడకాన్ని తగ్గించి, ఏఐ సాంకేతికతను వాడాలని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తద్వారా రైతాంగానికి సత్వర సేవలందించేందుకు అవకాశాలు ఏర్పడతాయని భావిస్తున్నట్టు తెలిపారు. తాము ప్రయోగిస్తున్న ఉపగ్రహ ఛాయాచిత్రాల వివరాలు, దాని ఆధారంగా వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న సేవలను ముఖ్యంగా పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడంలో అవలంబిస్తున్న పద్ధతులను ఇక్రిశాట్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పంటలకు వచ్చే తెగుళ్ళ, క్రిమికీటకాలు, నీటిఎద్దడి పరిస్థితులను అంచనా వేయడం తదితరాంశాలు గుర్తిస్తాయని తెలిపారు. తమ పరిశోధనల ఫలితంగా రైతులు ఏ విధంగా ప్రయోజనం పొందారనే విషయాలను వారు వివరించారు.

బనకచర్ల ప్రాజెక్టు వెనుక కేంద్రం కుట్ర

- వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం : కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్ వెనుక కేంద్రం కుట్ర ఉందని టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణ జలదోపిడీకి నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్రంలో బిజెపి మౌనంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, విభజన చట్టాన్ని పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్‌తో కేంద్రం చాటుమాటు వ్యవహారం మాదిరిగా బనకచర్లకు సంబంధించి వినతిని పరిగణనలోకి తీసుకోవడం సరికాదని హితవు పలికారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం సరైన సమయంలో సరైన రీతిలో స్పందించకుండా సమస్యను జఠిలం చేసిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అసమానతలు, చారిత్రక వాస్తవాలను కేంద్రం గ్రహించడం లేదని తప్పుపట్టారు. విభజన చట్టంలో నదీ జలాల వివాదం ప్రధానమైందనీ, ఆ వివాదాల పరిష్కారానికే కృష్ణా, గోదావరి నదులకు ప్రత్యేక బోర్డుల ఏర్పాటు, ఆ రెండింటిపై ఒక అపెక్స్ బాడీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ఆ బోర్డు దగ్గరికి వెళితే రాష్ట్ర ప్రభుత్వానికి అక్కడే అభ్యంతరం చెప్పే అవకాశం ఉండేదని తెలిపారు. అలా కాకుండా కేంద్ర ప్రభుత్వం దగ్గరికి వెళ్లడం, కేంద్రం కూడా ప్రోత్సహించిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. నికర జలాల సంగతి తేల్చకుండా మిగులు జలాల గురించి మాట్లాడటంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని కొట్టిపారేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతిచ్చి, నీటి కేటాయింపులు పూర్తి చేస్తే, మిగిలిన జలాలను వాడుకున్నట్టని వివరించారు. తెలంగాణకు జరిగే జలదోపిడీకి వ్యతిరేకంగా కలిసొచ్చే శక్తులన్నింటిని కలుపుకుని ఉద్యమిస్తామని హెచ్చరించారు. అందరూ కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. గత బిఆర్‌ఎస్ పాలకులు పదేళ్ల ప్రజలను మభ్యపెట్టి, చరిత్రను దాచిపెట్టి, నదీ జలాల వాటాను వాడుకునే అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు.

వేగంగా హైదరాబాద్ అభివృద్ధి

విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు : సిఎస్ రామకృష్ణారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చుట్టుపక్కల వేగంగా అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. అందులో భాగంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపాలిటీలను సందర్శిస్తున్నట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితోపాటు సంబంధిత శాఖల సెక్రటరీలతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఇటీవల ఓఆర్ఆర్ అవతలి వైపు కొన్ని గ్రామాలు, ఓఆర్ఆర్ పక్కన గల గ్రామాలు జిహెచ్‌ఎంసిలో విలీనమైనందున ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏ మేరకు అభివృద్ధి చెందుతున్నాయో సమీక్షిస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సౌకర్యంపై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కాలనీలలో పైప్‌లైన్లు వేయాలని, అందుకు సంబంధించి అంచనాలు వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా కావాల్సిన నిధులను గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు విడుదల చేస్తున్నట్టు వివరించారు. పన్ను వసూళ్లలో ఈ సంవత్సరం 23 శాతం అతి తక్కువగా చేయడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యాలను అధిగమించాలని, కొత్త ఇండ్ల అసెస్‌మెంట్‌లను చేయించి, మున్సిపాలిటీల ఆదాయం పెంచాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో విద్యుత్ దీపాలు, వార్డుల్లో నాలాల శుభ్రత తదితర అంశాల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా పని చేయాలని అధికారులకు సిఎస్ సూచించారు. అనంతరం కోత్వాల్‌గూడాలో నిర్మాణంలో ఉన్న హెచ్‌ఎండిఎ ఎకో పార్కును, రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. సిఎస్ వెంట రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, హెచ్‌ఎండిఎ సెక్రటరీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్‌డిఓ వెంకట్‌రెడ్డి, పిడి హౌసింగ్ నాయక్, తహసీల్దార్ రవీందర్‌దత్, కమిషనర్ సుమన్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఎస్ రామకృష్ణారావు



పారిస్‌లో రఘువంశీ ఏరోస్పేస్ జెట్ ఇంజిన్ ప్రదర్శన

హైదరాబాద్ : నగరానికి చెందిన ఎరో విడిభాగాల తయారీ కంపెనీ రఘువంశీ ఏరోస్పేస్ గ్రూప్ తన డిఫెన్స్, ప్రొపల్షన్ టెక్నాలజీలను 55వ అంతర్జాతీయ ప్యారిస్ ఎయిర్ షోలో ఆవిష్కరించింది. స్వదేశీ మైక్రోటర్బో ఇంజన్ల నుంచి అత్యధిక పనితీరు కనబరిచే కమికేజ్ డ్రోన్ల వరకు ప్రదర్శించినట్లు రఘువంశీ ఏరోస్పేస్ గ్రూప్ ఎండి వంశీ వికాస్ తెలిపారు. "మేం 100 శాతం స్వదేశీ సిస్టంలతో భవిష్యత్తులో జరిగే పూర్తి స్వతంత్ర యుద్ధతంత్రాన్ని రూపొందిస్తున్నాం. అస్త్రా 100 అనేది ఈ రంగంలో మన దేశ ఆధిపత్యానికి, సంసిద్ధతకు నిదర్శనం" అని వంశీ వికాస్ పేర్కొన్నారు.

ఎన్ఎస్‌డిసితో వెల్‌స్పన్ లివింగ్ ఒప్పందం

న్యూఢిల్లీ : వస్త్ర పరిశ్రమలో కార్మికులకు నైపుణ్యాలను పెంచడానికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్ఎస్‌డిసి)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్‌స్పన్ లివింగ్ వెల్లడించింది. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలతో పాటుగా ఉత్తరాఖండ్ నుండి 50 శాతం శాతం మహిళలు సహా 1,000 మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించనున్నట్లు పేర్కొంది. ఉపాధి అవకాశాలను పెంచడానికి, పరిశ్రమ భాగస్వామ్యాలను పెంపొందించడంలో ఈ భాగస్వామ్యం సహాయపడుతుందని వెల్‌స్పన్ లివింగ్ సిఇఒ దీపాలి గోయెంకా పేర్కొన్నారు.

చెన్నయ్‌లో ఫోక్స్‌వాగెన్ తొలి పెర్ఫార్మెన్స్ సెంటర్ ఏర్పాటు

చెన్నయ్ : ఫోక్స్‌వ్యాగన్ ఇండియా తమిళనాడులోని చెన్నయ్‌లో తొలి పెర్ఫార్మెన్స్ సెంటర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. మౌంట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ తమ గోల్ఫ్ జిటిఐ, టిగువాన్ ఆర్ లైన్ కొనుగోళ్లు చేసే వినియోగదారులకు మెరుగైన రిటైల్ అనుభవాన్ని అందించనుందని పేర్కొంది. దేశ వ్యాప్తంగా ప్రారంభించబడే నూతన మల్టీ టచ్‌పాయింట్‌లలో మొదటిదని వెల్లడించింది. ఆ రాష్ట్రంలో 27 విక్రయాలు, 19 సర్వీస్ టచ్‌పాయింట్‌లకు చేరుకున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధి అరుణ్ ఉప్పుస్వామి పేర్కొన్నారు.

పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించాలి



సర్జిపుల్ టన్నెల్ అప్రోచ్ కెనాల్ మోటారు పంపులను పరిశీలిస్తున్న నాయకులు

- కరువు పీడిత ప్రాంతాలపై మోడీ వివక్ష
- ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించాలి.. కరువు పీడిత ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని మహబూబ్‌నగర్ లాంటి జిల్లాలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి.." అని అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన సర్జిపుల్ టన్నెల్ అప్రోచ్ కెనాల్ మోటారు పంపులను శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాలో అతి తక్కువ వర్షాలు పడటం వల్ల కరువుకు నిలయంగా మారిందని, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి పథకం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటితోపాటు సాగునీటిని అందించేందుకు చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి పనులు మొదలుపెట్టి 15 ఏళ్లయినా... ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే ఆరు జిల్లాలకు సాగు, తాగునీరు అందించే అవకాశాలున్నాయన్నారు. ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోతే త్వరలో ఉద్యమం చేపడుతామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దక్షిణ తెలంగాణలో ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులు ఏవి చేపడతారో చెప్పాలని డిమాండ్ చేశారు.

సాగునీరు అందించడం మరింత ఆలస్యం
రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న అలసత్వం వల్ల సాగునీరు అందించడం మరింత ఆలస్యం అవుతోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ప్రాజెక్టు.. 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన తొమ్మిది మోటర్లు ఉన్నాయన్నారు. 35 వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు నేడు 60 వేల కోట్లకు పెరిగిందన్నారు. ఇంకా ఆలస్యమైతే వ్యయం పెరిగి సాగునీరు అందించడం కూడా మరింత ఆలస్యం అవుతుందన్నారు. 2023 సెప్టెంబర్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభ ఎన్నికలకు ముందు ఒక మోటార్ ద్వారా నీటిని విడుదల చేసి ఆ తర్వాత వెంటనే నీటిని నిలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు ఆరు జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయన్నారు.

రాష్ట్రంలో ఎనిమిది మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అరిబండి ప్రసాద్‌రావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రారెడ్డి, జంగారెడ్డి, శోభన్, మధుసూదన్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, కందికొండ గీత, దేశ్యానాయక్, చింత ఆంజనేయులు, పి ఆంజనేయులు, వనపర్తి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు ఎం శ్రీనివాసులు, నరసింహ, దేవేందర్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలో మార్పులతో లాభాలేమిటి?

- టియుఎంహెచ్ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్‌లో ప్రభుత్వం రహస్యంగా చేస్తున్న మార్పులతో లాభాలేంటని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు) ప్రశ్నించింది. ఆ మార్పులతో ప్రజలకు, ఉద్యోగులకు, వైద్యారోగ్యశాఖకు కలిగే ప్రయోజనాలేంటో బహిరంగం చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు రావలసిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2005 ఏప్రిల్ 12న నేషనల్ రూరల్ హెల్త్ మిషన్, 2013లో ప్రారంభమైన నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రారంభం కాగా, ఆ రెండింటిని విలీనం చేసి నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో వైద్య ఆరోగ్య రంగంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం 60:40 శాతంగా ఉందని చెప్పారు. దీంతో నేషనల్ హెల్త్ మిషన్‌లో దశాబ్దాల తరబడి పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులు 17,541 మందికి కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు అమలు కాక, ఉద్యోగాల రెగ్యులరైజేషన్‌కు నోచుకోక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని తెలిపారు. అందరిని యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, ఉద్యోగులకు నష్టం చేసే ఏ విధమైన సంస్కరణలు చేసిన ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ విధానాన్ని బహిరంగం చేయకపోతే దశలవారీగా ఆందోళనా పోరాటాలు తప్పవని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎంలో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఏఎన్ఎంలు, డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్స్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్స్, అకౌంటెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్స్, సెక్యూరిటీ గార్డులు, సపోర్టింగ్ స్టాఫ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు సమర్థవంతంగా సేవలందిస్తున్నారని వారు గుర్తుచేశారు.

హనుమకొండ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: హనుమకొండ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కాల్ తీవ్ర కలకలం రేపింది. హనుమకొండ అదాలత్‌లోని జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్టు శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేసి చెప్పాడు. ఇలా బెదిరింపు కాలు రావడం ఇది మూడోసారి. వెంటనే అప్రమత్తమైన సుబేదారి పోలీసులు కోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. బాంబు కలకలంతో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తనిఖీల్లో భాగంగా కోర్టు ఆవరణలో భద్రపరిచిన ఆరు డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ డిటోనేటర్లను ఆత్మకూరుకు చెందిన ఓ కేసు విషయంలో గతంలో స్వాధీనం చేసుకున్నవిగా పోలీస్ వర్గాల సమాచారం. ఈ డిటోనేటర్లకు సంబంధించిన కేసు కూడా గతంలోనే కోర్టు కొట్టేసినట్టు సమాచారం. దీంతో తాజాగా బాంబు బెదిరింపు కాల్‌కు ఈ డిటోనేటర్లకు ఎలాంటి సంబంధమూ లేనట్టు పోలీసులు తెలిపారు. ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మరే ఇతర బాంబు లేదని నిర్ధారణకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



స్పెషల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫెడరేషన్ సభ్యులు

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

- కొత్త స్పెషల్ కమిషనర్‌కు ఫెడరేషన్ వినతి
- అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులపై దృష్టిపెట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తక్షణం అక్రిడిటేషన్లు ఇవ్వాలనీ, కొత్త ఆరోగ్య విధానాన్ని తీసుకురావాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సమాచార్‌భవన్‌లో కొత్త స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఐఎఎస్ అధికారి సిహెచ్. ప్రియాంకను ఫెడరేషన్ బృందం కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించింది. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పి.రామచందర్, గుడిగ రఘు, విజయానంద్, తాటికొండ కృష్ణ, కార్యదర్శులు సలీమ, ఈ చంద్రశేఖర్, బి జగదీష్, దామోదర్, బి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు పి విజయ, నాయకులు పద్మనాభరావు, కె లలిత తదితరులు స్పెషల్ కమిషనర్‌తో దాదాపు గంటపాటు చర్చించారు. ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, మహిళా జర్నలిస్టుల సమస్యలు, వేజ్ బోర్డు అమలు, ప్రత్యేక రక్షణ చట్టం, రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకం, మీడియా అకాడమీ శిక్షణా తరగతులు, మీడియా కమిషన్ తదితర అంశాలపై కూలంకషంగా ఫెడరేషన్ అభిప్రాయాలను స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అక్రిడిటేషన్లకు నాలుగోసారి స్టిక్కర్లు వేయబోతున్నారనీ, ఇది సరికాదన్నారు. జర్నలిస్టుల విధుల నిర్వహణకు ఇది ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పెన్షన్ పథకాన్ని రిటైరైన జర్నలిస్టులకు తెలంగాణలో కూడా అమలుచేయాలని కోరారు. రాత్రిపూట మహిళా జర్నలిస్టులకు పనిచేసే చోట నుంచి రవాణా సౌకర్యం కల్పించేలా ఆయా సంస్థలపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని ఫెడరేషన్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మీడియాతోపాటు జర్నలిస్టుల పరిస్థితులను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని స్పెషల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

గంజాయి విక్రయిస్తున్న మహారాష్ట్ర ముఠా అరెస్ట్

- 166 కేజీల గంజాయి స్వాధీనం
- నిందితుల్లో మహారాష్ట్ర రైల్వే ఉద్యోగి సాగర్ గజానన్



మీడియాతో మాట్లాడుతున్న సిపి సుధీర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న మహారాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్ఓటి, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన 166 కేజీల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.6,200 స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డా.సుధీర్‌బాబు ఎల్‌బి నగర్ సిపి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

మహారాష్ట్రకు చెందిన ప్రధాన సూత్రధారి వికాస్ బాబన్‌సాల్వే గంజాయి కొనుగోలు చేసి అమ్మేవాడు. ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో గంజాయి కేసులో అతనిపై వారెంట్ ఉన్నది. మహారాష్ట్రకు చెందిన రైల్వే ఉద్యోగి సాగర్ గజానన్ ఖండేభరద అలియాస్ సాగర్, రంగనాథ్ యురాజేన్ సహాదేవ్, డ్రైవర్ అమోల్ నారాయణ భోర్డే జైలులో స్నేహితులుగా మారి గంజాయి స్మగ్లింగ్ కోసం పథకం రూపొందించారు. ఒడిషా నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు సరఫరా చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం హయత్‌నగర్‌లోని ధనుంజయ ఫంక్షన్ హాల్ వద్ద వాహనాలు తనిఖీలు చేసే సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 50 లక్షలు విలువగల 166 కేజీల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లు, 6200 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్ఓటీ డీసీపీ షాకీర్ హుస్సేన్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ ముస్తాక్ అలీ, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, ఎస్ఐ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల తొలగింపు

- నిర్మాణ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకే : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు వరంగల్ జిల్లా అధ్యక్షులు మాలోతు సాగర్, జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి నిర్మాణ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా యూనియన్ నుంచి తొలగిస్తున్నట్టు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో చుక్కరాములు అధ్యక్షతన సిఐటియు రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. వారిద్దరూ యూనియన్ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నందున సిఐటియులో వారిద్దరూ చూస్తున్న అన్ని బాధ్యతల నుంచి తక్షణం తొలగించాలని నిర్ణయించారు. వరంగల్ జిల్లా సిఐటియు శ్రేణులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సంఘాన్ని ఐక్యం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సిఐటియు వరంగల్ జిల్లా సభ్యులంతా చురుకుగా క్యాంపెయిన్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్రోన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణ

- ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి ప్రయత్నం
- రాబోయే రోజుల్లో మరిన్ని నియామకాలు
- 'ఆపరేషన్ రోప్'ను శాస్త్రీయ పద్ధతిలో బలోపేతం చేస్తాం : హైదరాబాద్ సిపి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ సిపి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ట్రాఫిక్‌ను డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని, వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి గూగుల్ కంపెనీ సహాయం తీసుకుంటున్నామని నగర సిపి సివి ఆనంద్ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు, పరిష్కార మార్గాలపై నగర ట్రాఫిక్ విభాగం నేతృత్వంలో శుక్రవారం బంజారాహిల్స్‌లోని సిసిసిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి నగర సిపి, డిజి సివి ఆనంద్ హాజరయ్యారు. ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ ప్రాథమిక సూత్రాలపై ట్రాఫిక్ జాయింట్ సిపి డి జోయల్ డెవిస్‌తో కలిసి సీపీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిపి సివి ఆనంద్ మాట్లాడుతూ.. గత ఏడాది వరకు నగరంలో వాహనాల సగటు వేగం గంటకు 17 నుంచి 18 కిలోమీటర్లు ఉండేదని, ప్రస్తుతం ఇది గంటకు 24 నుంచి 25 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఎంతో కష్టపడితేనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 1600 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని, మూడు కమిషనరేట్ల పరిధిలో కలిపి ఒక్క రోజే 91 లక్షల వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ రోప్' నుంచి మంచి ఫలితాలు వచ్చాయన్నారు. దీనిని మరింత శాస్త్రీయ పద్ధతిలో బలోపేతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. వీఐపీల రాకపోకలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, సిఎం కూడా తన ప్రయాణ సమయాల్లో ఎక్కువ సేపు ట్రాఫిక్‌ను నిలపొద్దని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 శాతం సిగ్నల్స్ ఆటో మోడ్‌లో నడుస్తున్నాయన్నారు.

ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి గూగుల్ మ్యాప్స్‌తోపాటు, గూగుల్ వారు సాంకేతికంగా తమకు సహకరిస్తున్నారని ప్రశంసించారు. నగరంలోని బహుళ అంతస్తుల భవనాల యజమానుల సహకారంతో 25 భవనాలపై 'హైరేస్ కెమెరాలను' బిగించి 'ఈగల్ వ్యూ'ను సేకరిస్తున్నామన్నారు. ఈ విధానంతో ట్రాఫిక్ అధికారులు ముందస్తుగా సమస్యలను గుర్తించి, స్థానిక ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేయడం, దానికి తగ్గట్టు పరిష్కార మార్గాలను సూచించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సిబ్బంది కొరత ఉన్నందున, 'ట్రాఫిక్ మార్షల్' వ్యవస్థను ప్రవేశపెడుతున్నామన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద వారే మార్షల్స్‌ను నియమించుకోవాలని, వారికి శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగిస్తామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా చక్కగా విధులు నిర్వహిస్తున్నారని, మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించామన్నారు. రాబోయే రోజుల్లో ట్రాఫిక్ విభాగంలో మరిన్ని నియామకాలు చేపడతామని, ఇతర శాఖలలో కూడా నియామకాలు చేపట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. రాబోయే వర్షాకాలం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖలు సమన్వయంతో ముందుకు వెళు_న్నామన్నారు. నగరంలో ప్రయివేటు ట్రావెల్స్ బస్సుల వల్ల అవాంతరాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, దానిపై యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సిపిలు, జాయింట్ సిపి, డిసిపిలు అదనపు డిసిపిలు, ఎసిపిలు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు తదితర అధికారులు హాజరయ్యారు.

పోడు భూముల వివాదం

- కందకాల తవ్వకాలను అడ్డుకున్న వలస గిరిజనులు
- ఫారెస్ట్ అధికారులకు, పోడుదారులకు మధ్య వాగ్వాదం



జెసిబిని అడ్డుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో శుక్రవారం పోడు భూములపై వివాదం చోటుచేసుకుంది. ఫారెస్ట్ భూమిలో కందకాలు తవ్వేందుకు వెళ్లిన జెసిబిని ఆదివాసీ మహిళలు అడ్డుకున్నారు. జేసీబీకి అడ్డుగా బైటాయించారు. ఫారెస్ట్ అధికారులు మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మహిళలకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. తాము సాగు చేసుకుంటున్న పోడు భూములకు కందకాలు తవ్వొద్దని మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామ పెద్దలతో చర్చించిన తరువాతే కందకాల తవ్వకాలు చేపట్టామని ఫారెస్ట్ అధికారులు వివరించారు. ఈ క్రమంలో ఫారెస్ట్ అధికారులకు, మహిళలకు మధ్య మాటమాట పెరిగి వివాదంగా మారింది. ఘర్షణ వాతావరణం నెలకొంది. ఫారెస్ట్ అధికారులు తమపై దాడి చేశారని మహిళలు ఆరోపించారు.

ఈ విషయమై అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్‌ను వివరణ కోరగా.. కొసగుంపు గ్రామ సమీపంలోని ఫారెస్ట్ భూమిలో ప్లాంటేషన్ వేసేందుకు ముందుగా కందకాలు తవ్వే పనులు ప్రారంభించామన్నారు. గ్రామస్తులు, పెద్దలతో రెండు నెలలుగా చర్చించిన తరువాతే సామరస్యంగా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రామస్తులకు ఎలాంటి ఆర్ఎస్ఆర్ పట్టాలు లేకుండా అటవీ భూములను ఆక్రమిస్తున్న క్రమంలోనే ప్లాంటేషన్ వేసేందుకు కందకాలు తవ్విస్తున్నామన్నారు. కానీ, మహిళలు ఫారెస్ట్ సిబ్బందిని అడ్డుకుని దుర్భాషలాడారన్నారు. తిరిగి తామే దాడి చేసినట్టు తప్పుడు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఫారెస్ట్ అధికారులు తమపై దాడులకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని కొసగుంపు గ్రామానికి చెందిన కొందరు మహిళలు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, ఎస్ఐ రాజేశ్‌కు ఫిర్యాదు చేశారు.

అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పోడు సాగుదారులపై అశ్వాపురం రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు దాడి చేయడంపై చర్యలు తీసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పోడు సాగుదారులపై అశ్వాపురం రేంజర్ ఫారెస్ట్ అధికారులు దాడి చేసి ఆదివాసీ మహిళలను తీవ్రంగా కొట్టారని బత్తుల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. మహిళలపై దాడి చేసిన వారిపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మడకం సునీత, కుంజా జోగమ్మ, ఎట్టి భీమ్, మడకం నందిని, తెల్లం గంగి, తాటి లక్ష్మి, కోస, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకివ్వొద్దు

- విద్యాశాఖ కమిషనర్‌కు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను స్వచ్ఛంధ సంస్థలకివ్వొద్దని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై స్వప్న, ఎస్‌వి రమ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాల్సిందేనన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ కమిషనర్‌కు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులతో పాటు స్కీమ్ వర్కర్లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడ్లకు అదనపు బడ్జెట్ కేటాయించాలనీ, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకివ్వాలని కోరారు. అక్రమ తొలగింపులు ఆపి రాజకీయ వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. వంటషెడ్లు, వంట పాత్రలు, తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలనీ, సామాజిక భద్రత కల్పించాలని విన్నవించారు. ప్రమాద బీమా, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వికలాంగుల సంక్షేమంపై చర్చకు సిద్ధమా?

- బిజెపి ఎంపి అరవింద్‌కు ముత్తినేని సవాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందంటూ బిజెపి ఎంపి అరవింద్ చేసిన వ్యాఖ్యలను వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వికలాంగుల సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి ఏం చేసిందో కూడా చర్చిద్దామని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేండ్లలో కేంద్రంలో అధికారంలోని బీజేపీ సర్కారు వారికి ఎంత అన్యాయం చేసిందో ఆధారాలతోసహా చూపిస్తానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు కేంద్రం వికలాంగులకు కేవలం రూ. 300 పెన్షన్ ఇస్తున్నదనీ, రాష్ట్ర ప్రభుత్వం మూడువేలు ఇస్తున్నదని తెలిపారు. వారికి పెన్షన్ పెంచాలంటూ కేంద్రాన్ని అడిగే దమ్ముందా? అని ప్రశ్నించారు. జిల్లాకో మానసిక వికలాంగుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉన్న దాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టిపిసిసి వికలాంగుల విభాగం స్టేట్ జనరల్ సెక్రటరీ చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దేశగాని సతీశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సిరిగిరి రజినీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్యపాగ సురేష్, నాయకులు పరమేష్, జోకు స్వామి తదితరులు పాల్గొన్నారు.